# పోలవరం ప్రాజెక్టు నిర్మాణం -సమస్యలు-వైఖరులు

**2014లో** తెలుగుదేశం పార్టీ అధికారం లోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయడం తన లక్ష్యం అని చెప్పారు. ప్రతి సోమవారం ఇక పోలవారమని ప్రకటించాడు. 2018 నాటికి ప్రాజెక్టు కాలవలగుండా పారకం (గ్రావిటీ) ద్వారా నీరు పారిస్తామని ముఖ్యమంత్రి, జలవనరుల మంత్రి చెప్పారు. "మోడీ బాబు జోడీ" అద్భుతం అనీ, విభజన హామీలలో పోలవరం జాతీయ ప్రాజెక్టు అయింది కనుక ఇక నిర్మాణం పరుగులు పెడుతుందని నాయకులంతా ప్రకటించారు. రాష్ట్రం మొత్తం మీద ఉచితంగా బస్సులు వేసి ముఖ్యంగా రాయలసీమ ప్రజల్ని పోలవరం ప్రాంత పని ప్రదేశాలలో తిప్పారు. ప్రచారంకోసం కోట్లు ఖర్చుపెట్టారు. వీటిమధ్యే ముఖ్యమంత్రి సమీక్షలు జరుపుతున్నట్లు, నిల వేస్తున్నట్లు, పని జరగడంలేదని హూంకరిస్తున్నట్లు, కాంట్రాక్టర్లను మార్చుతున్నట్లు ప్రకటనలు చేస్తున్నారు. ఈలోగా నితీన్ గడ్కరి కేంద్ర జలవనరులమంత్రిగా బాధ్యత తీసుకొన్నాడు. పోలవరం ప్రాజెక్టును చూసి ఇక నుండి ఇది 'నా ప్రాజెక్టు' అని చెప్పాడు. ముఖ్యమంత్రి 'స్వప్నా'నికి, గడ్కరి 'ఆయన ప్రాజెక్టు'కి మధ్య దానివెనుక జరిగిన లోగుట్టు వెల్లడి కావల్సే వుంది. ఇపుడు అంతా బజారున పడ్డారు. ఒకరిపై ఒకరు రంకెలు వేసు కొంటున్నారు. పోలవరానికి అడ్డంవస్తే సహించ బోమని ముఖ్యమంత్రి అంటున్నాడు. ఆయనకు అనుగుణంగా మసాలా అంతటినీ మీడియా జతపర్చి ప్రచారం చేస్తున్నది. జాగ్రత్తగా పరిశీలిస్తే ఇవ్వన్నీ నాటకాలని, లాలూచీ కుస్తీలని, ప్రజల పాలిట క్రూరమైన పరిహాసమనీ అర్థమవుతుంది.

2018-19 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసే ఉద్దేశంలేదనీ, ఎత్తిపోతల ద్వారా సంతృప్తి పరచవచ్చనీ అనుకున్నారు. దీనికి ముఖ్యమైన రుజువు ఏమంటే పట్టిసీమ ఎత్తిపోతలకు 1660 కోట్లు, పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు 1638 కోట్లు ఖర్చుతో గోదావరి జలాలను తరలించాలనే నిర్ణయమే. నిజంగా పోలవరం పూర్తిచేయగలిగితే, ఎత్తిపోతల పథకాల అవసరమే వుండదు. కాగ్ నివేదికలు కూడా దాన్నే స్పష్టపరుస్తున్నాయి. ఒక పక్క ప్రాజెక్టు పనులు నత్తనడకన ఉన్నా నిర్వాసితులను ఖాళీ చేయించాలనే హడావిడి, వత్తిడి నిరంతరం సాగుతోంది. ఎప్పటికప్పుడు డెడ్‌లైన్‌ను ప్రకటిస్తున్నారు.

"ప్రాజెక్టు పూర్తవబోతోంది. నిర్వాసితులు వెళ్ళిపోవాలనే" హడావిడి ఈ రోజుది కాదు. 2005లో నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టు పనులు ప్రారంభించాక నిర్వాసితులు కాబోతున్న 370 గ్రామాల ప్రజలపై ఒక మానసిక దాడిని ప్రారంభించింది. ఇక ప్రాజెక్టు 2-3 ఏళ్ళలో వచ్చేస్తుంది. ప్రజలు ఖాళీ చేసి వెళ్ళిపోవాలన్న వాతావరణం నిర్వాసితులలో కల్పించింది. అభివృద్ధి వర్సెస్ ఆదివాసులు, ఏజెన్సీ ప్రజలనే పోటీకి నిలబెట్టింది. అభివృద్ధి కావాలంటే కొందరు తమ భూములను, జీవితాలను వదులుకోక తప్పదని ప్రచారం సాగించింది. దీని ఫలితంగా ప్రజలు, ఆదివాసులు తీవ్ర నిరాశ, నిస్పృహలకి గురయ్యారు. వ్యవసాయాలు, పశువుల కాపు, ఇంటి మరమత్తులు మొదలైన అన్నింటినీ పట్టించుకోవడం ఆగిపోయింది. ఇలాంటి స్థితిలో నాటి సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర నాయకులు(ప్రస్తుత ప్రధాన కార్యదర్శి)కా॥విశ్వం ఏజెన్సీ ప్రాంత గ్రామాలలో పర్యటించారు. ప్రజలలో నెలకొన్న నిరాశా ధోరణిని గమనించి పాలకుల రాజకీయ, ఆర్థిక సంక్షోభాల నేపధ్యంలో పోలవరం ప్రాజెక్టు 2020కి కూడా పూర్తికాదని, తక్షణం వెళ్ళిపోవాల్సిన పరిస్థితి ఏమీలేదని, నిలబడాలనీ, జీవించే హక్కుకోసం పోరాటాన్ని కొనసాగించాలనీ పిలుపునిచ్చారు. రాజకీయ పరిస్థితి మీద నాయకత్వ అంచనా నేటికీ సరైందని తేలుతోంది.

**పోలవరం ప్రాజెక్టు-దాని పూర్వరంగం -పాలకుల జలవనరుల విధానం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడటానికి ముందే కమ్యూనిస్టుపార్టీ, దేశభక్తికల కొందరు ఇంజనీరింగ్ నిపుణులు తెలుగు ప్రాంత ప్రజల సమగ్ర అభివృద్ధికోసం ఎన్నో ప్రణాళికలను అందించారు. కమ్యూనిస్టు పార్టీ దోపిడీ, అణచివేత, అసమానత్వా లకు తావులేని అభివృద్ధి నమూనాలను ప్రజల ముందుంచింది. జలవనరుల సమగ్ర వినియోగం కోసం డిమాండ్ చేసింది. గుల్హాటి కమీషన్ వంటివి కొన్ని నివేదికలను ప్రభుత్వానికి అందించాయి. గోదావరి, కృష్ణాల అనుసంధానాన్ని మూడు అంచెలుగా సాగించాలని చెప్పాయి. దిగువ పోలవరం, ప్రకాశంబ్యారేజీ మధ్య పులిచింతల నుంచి ఖమ్మం, వరంగల్ మధ్య గోదావరివద్ద, ఎగువ నాగార్జునసాగర్, పోచంపాడు మధ్యగా గోదావరి- కృష్ణాలను కలిపి తెలంగాణా, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలలోని అత్యధిక ప్రాంతాలకి నీరు అందించడం ద్వారా వరద నివారణ, కరువు నివారణ చేపట్టవచ్చని సూచించాయి. కానీ నాటి బ్రిటీష్ పాలకులకు, వారి అనంతరం వారి చెప్పుల్లో కాళ్ళు దూర్చిన భారత పాలకులకు సమగ్ర అభివృద్ధి అభిమతం కాదు. తమ దోపిడీ పాలన అవసరం కోసం జాతులమధ్య, ప్రాంతాలమధ్య, ప్రజలమధ్య అసమాన అభివృద్ధి నమూనాను ముందుకు తెచ్చారు. ఇది వ్యవస్థ స్వభావం. ఫలితంగా ఉత్తరాంధ్ర, నల్గొండ, పాలమూరు తదితర ప్రాంతాలు నిత్య కరువు ప్రాంతాలుగా చౌకకూలీల సరఫరా కేంద్రాలుగా వుంచారు. తమ పారిశ్రామిక రంగానికి చౌకగా ముడిసరుకులు సరఫరా చేసే ప్రాంతాలను వాణిజ్యపంటలు పండే ప్రాంతాలుగా నిర్ణయించి, అక్కడా జలవనరుల అభివృద్ధి జరగకుండా చూశారు. శ్రీశైలం ప్రాజెక్టును కేవలం జలవిద్యుత్తు ప్రాజెక్టుగానే వుంచాలనే షరతుమీద, నందికొండకాక నాగార్జునసాగర్‌లో కృష్ణపై ప్రాజెక్టు నిర్మాణం-నాటి పాలకుల సామాజిక, వ్యవసాయ విధానానికి లోబడిన జలవనరులవిధానం ఫలితంగా జరిగినదే. భూమికి వున్నట్లే నీటికీ వర్గ ప్రయోజనాలు వుంటాయి. భూస్వామ్య, సామ్రాజ్యవాద అనుకూల దళారీ పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం అమలుజరిగిన జలవనరుల విధానం తెలుగుప్రజల సమగ్ర అభివృద్ధిని అడ్డుకుంది. అన్ని ప్రాంతాల, ప్రజలమధ్య వైమనస్యం ఏర్పడేలా, భూస్వామ్య వర్గం బలపడేలా ఆర్థిక,

రాజకీయ విధానాలు అమలయ్యాయి. ప్రజలకి కరువు, వలసల జీవితం తప్పనిసరైంది. కట్టబడే ప్రాజెక్టులు పాలకుల అవసరాలకోసం మార్పులు చేయబడి అమలు జరిగాయి. 1980లలో కమ్యూనిస్టు విప్లవకారులు జలవనరుల అభివృద్ధికై మరోసారి ఆందోళనలు నిర్వహించుతున్న క్రమంలో పోచంపాడు ప్రాజెక్టు నీరు-తెలంగాణా సమగ్ర అభివృద్ధికి కాకుండా ఎలా తగ్గించి మళ్ళించబడిందో వివరించారు. నల్గొండ, పాలమూరు జిల్లాల కరువు, ఫ్లోరోసిస్, వలసల సమస్యలపై పాలకుల నిర్లక్ష్యవైఖరికి వ్యతిరేకంగా ప్రజలను కదలించారు.

**ప్రపంచీకరణ-మారిన జలవిధాన ప్రాధాన్యతలు**

1990ల తర్వాత ప్రపంచీకరణ, సరళీకరణల నూతన ఆర్థిక విధానాల పేరిట సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను దేశ, రాష్ట్ర పాలకులు అమలు చేశారు. ప్రపంచబ్యాంకు కొత్త ప్రాధాన్యత లను ముందుకు తెచ్చింది. దాని ప్రకారం ఇకపై నీరు అన్నది వాణిజ్య సరుకుగా మారాలి. కొత్త ఆయకట్టులకు కొత్తగా నీరందించే ప్రాజెక్టులు చేపట్టరాదు. చేపట్టవలసిన ఏ ప్రాజెక్టులు అయినా వాణిజ్య, పట్టణ, విద్యుత్, పారిశ్రామిక అవసరాలను ముందు తీర్చేలా అమలు జరగాలి. వరిపంటను నిరుత్సాహపరచాలి. ఆరుతడి వాణిజ్యపంటలను, తోటలను ప్రోత్సహించేలా నీటి పారుదల వ్యవస్థలు వుండాలి. ఇక వ్యవసాయానికి వెళుతున్న ప్రతి నీటి బొట్టుకి మీటర్లు పెట్టి, దానికి తగిన ఖరీదు వసూలు చేయాలి. ఈవిధంగా 'కరువు నివారణ, వరద నివారణ-ఆహారభద్రత అన్న 1960ల నాటి ప్రాధాన్యతలు పోయి కొత్త ప్రాధాన్యతలు జల వనరుల విధానంలో అమలులోకి వచ్చాయి. నేటికీ అదేవిధానం అమలు అవుతున్నది. అందువలననే సింగూరు ప్రాంత రైతులకు నీరందదు కానీ హైదరాబాద్‌కి సింగూరు జలాలు తరలిపోతాయి. పాత నల్గొండ జిల్లాలోని దేవరకొండ ప్రాంతం నేటికీ ఫ్లోరోసిస్ బారినపడే వుంటుంది. కానీ ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు జలాలు హైదరాబాద్‌కి వెళతాయి. ఈరోజు మంచిర్యాలలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పక్క రైతాంగం నీరు కోరుతున్నారు అయినా ఆ నీరు హైదరాబాద్‌కే తరలుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఏలేరు ఆయకట్టుకింద రైతులు గొడవలు పడుతుంటారు. విశాఖకు ఏలేరు నీటిని తరలిస్తున్న కాలవమీద మోటార్లు పెట్టుకొని తమ పంటలు ఎండిపోకుండా ఆ నీటిని తోడుకొంటుంటే రైతులను నీటి దొంగలుగా చిత్రిస్తూ, పోలీసుల సాయంతో మోటార్లను తొలగించిన చరిత్ర వుంది. సింగూరు, ఏలేరు ఒకే పరిస్థితికి అద్దంపడుతున్నాయి. రాయలసీమ నిరంతర కరువు ప్రాంతంగానే కొనసాగుతోంది. పోతిరెడ్డిపాడు ఒక రాజకీయ వివాదంగా నడుస్తూ వుంటుంది. ప్రకాశం బ్యారేజిలో నీళ్ళు నిండుగావున్నా థర్మల్‌విద్యుత్ కేంద్రాలకుగానూ నీరు నిలవపెడతారు. ఇపుడు నీరు నిలవచేసినా, విడుదల చేసినా రైతులకోసం కాదు, జలవిద్యుత్ కేంద్రాల ఉత్పత్తికోసం జరుగు తోంది. ఇక మహానగరాలకి నీరు అందుతుందంటే అక్కడి ప్రజలందరికోసం కాదు. మురికివాడల, దిగువ, మధ్యతరగతి ప్రజలకు ఈ నీరు రేషన్ ప్రకారం రెండురోజులకి ఒకసారి అరకొరగా సరఫరా అవుతుంది. నాసిరకం పైపు లైనులు ఈ నీళ్ళలో కలుషిత నీటిని కలుపుకొని వెళ్ళి రెండు తెలుగు రాష్ట్రాల్లో పట్టణ ప్రజలకు అతిసారవ్యాధిని వ్యాపింపచేస్తూనే వున్నాయి.

కనుక నీరు ఒక వాణిజ్య సరకు, ఒక దోపిడీ వనరు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నీటి పారుదల పథకాల గురించి వేలకోట్ల ఖర్చు జరుగుతున్నట్లు కనిపిస్తుంది. కానీ మంచినీటి వ్యాపారం వేలకోట్ల రూపాయలలో సాగుతోంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ జలవనరుల విధానంగా అమలు జరగడం అంటే ఇదే.

ఈవిధంగా ప్రపంచబ్యాంకు నిర్దేశిత విధానాలను రెండు తెలుగురాష్ట్రాలలోని పాలక వర్గాలు ఆమోదించి అమలుచేస్తున్నాయి. పెద్దఎత్తున ప్రజాధనాన్ని కొల్లగొట్టేలా అమలు చేస్తారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామని ప్రాజెక్టులు ప్రకటిస్తారు. వాటి ఖర్చుల అంచనాలను విపరీతంగా పెంచుతారు. ఆ ప్రాజెక్టుల కాలువలు నీరు పారించవు. కానీ నిరంకుశ కాంట్రాక్టర్ల వర్గానికి నిధులు పారిస్తాయి. చిన్న చిన్న కాంట్రాక్టర్లకి కూడా వాటిలో చోటులేదు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలు రంగంలోకి దిగాయి. విదేశీ బహుళజాతి కంపెనీలైన హిటాచి, మిట్సుబిషి, కాటర్‌పిల్లర్ వంటి భారీ వాహనాల, యంత్రాల తయారీ సంస్థలకు మనదేశం ఒక మార్కెట్. ప్రజాధనం లూటీలో సామ్రాజ్యవాద ప్రత్యక్ష పాత్రకి ఇది నిదర్శనం.

**పోలవరం ప్రాజెక్టు**

పై అంశాలు అన్నింటి నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు ముందుకు వచ్చింది. అంతవరకూ కాగితాలపై మూలుగుతున్న డిజైన్లు, శిథిలమైన శంకుస్థాపన ఫలకాల నుంచి పైన పేర్కొన్న రాజకీయ ఆర్థిక పరిస్థితులలో అంతర్జాతీయ స్థాయి అనుబంధాలతో, రాజకీయ నాయకులే కాంట్రాక్టర్లుగా మారి శక్తివంతమైన శ్రేణిగా ఏర్పడ్డాకనే పోలవరం ప్రాజెక్టుకు కదలిక వచ్చిందని గుర్తించాలి. అంతకుముందు స్వర్ణ చతుర్భుజి పేరుతో పెద్దఎత్తున జాతీయ రహదార్ల నిర్మాణ క్రమంలో ఎదిగిన కాంట్రాక్టర్లశ్రేణి, బ్యాంకుల, ప్రభుత్వాల, అంతర్జాతీయ ఫైనాన్సు సహకారంతో బయల్దేరింది. సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థలు పెద్దఎత్తున తరలించిన ద్రవ్య పెట్టుబడి దేశీయ కాంట్రాక్టర్ల శ్రేణికి పెద్దతాయిలం లాగా కనిపించింది. ప్రభుత్వాల మద్దతుతో ఈ శ్రేణు లందరూ కదిలారు. దీనికి తగిన రాజకీయ నాయకత్వం వైయస్.రాజశేఖరరెడ్డి రూపంలో లభించింది.

ఈవిధంగా పోలవరం ప్రాజెక్టుకు రంగం సిద్ధమైంది. పాలకులకు పోలవరం ప్రాజెక్టు ప్రజల అవసరాలకోసంకాక తమ ప్రయోజనాలకోసం కావాలి. వాళ్ళు విశాఖ-చెన్నై కోస్టల్ కారిడార్, దానిలో భాగంగా విశాఖ-కాకినాడ కోస్టల్ కారిడార్‌ను 3 లక్షల 40 వేలకోట్ల రూపాయల పెట్టుబడితో ఒక లక్షా 50వేల ఎకరాలలో ఏర్పాటు చేయదలచుకొన్నారు. ఆ పేరిట పర్యావరణ విధ్వంసం జరిపే షిప్‌బ్రేకింగ్ యూనిట్లు, పెట్రో కెమికల్ ప్లాంటులు, ఇతర పరిశ్రమలు నిర్మించాల్సి వుంది. వీటికి, వీటి అనుబంధ పరిశ్రమలకు, సేవారంగ అవసరాలకు జలవనరులు కావాలి. అంతకంటే ముఖ్యంగా మానవ వనరులు కావాలి. కోస్తాజిల్లాల్లో

పెరుగుతున్న కూలిరేట్లు, వలసల వల్ల, మానవవనరుల అవసరం చాలా వుంది. పోలవరం ప్రాజెక్టు వెనక కల్లాకపటం ఎరుగని, శ్రమజీవులైన ఆదివాసీ, ఏజెన్సీ ప్రజలున్నారు. కనీసం 2 లక్షల మందిని నిర్వాసితుల్నిచేసి కూలీ మార్కెట్‌కి అప్పగించే ప్రాజెక్టు ఇది. (ప్రస్తుత ముఖ్యమంత్రి వేలమందితో కూడిన పునరావాస కాలనీల కాంప్లెక్సులు నిర్మించి అక్కడ పరిశ్రమలు స్థాపించు తారట). పోలవరం ప్రాజెక్టుకోసం 25వేల ఎకరాల విలువైన భూమి కాలువలకింద సేకరించి కాలువలు తవ్వారు. కనీసం ఆ కాలవలలో నీరు ఇంకినా, అవి ప్రవహించే దారి పొడవునా భూగర్భజలాల మట్టం పెరుగుతుంది. అలాంటి అవకాశం లేకుండా పూర్తిగా కాంక్రీటు చేయబడిన కాలవలు అవి. అంత విస్తృతమైన నేపధ్యంలో పోలవరం ప్రాజెక్టు పని ప్రారంభించింది.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎవరు చేపట్టాలనే దానిపై కాంట్రాక్టర్ వర్గాల్లో పోటీలు నెలకొన్నాయి. ప్రతి కాంట్రాక్టర్ మారడం, ప్రాజెక్టు అంచనా ఖర్చు రెట్టింపు కావడం జరుగుతూ వచ్చింది. 2004 ప్రారంభ దినాలలో ప్రాజెక్టు మొత్తం నిర్మాణ వ్యయ అంచనా రు. 8,194 కోట్లు అని అన్నారు. 2005లో మొత్తం ప్రాజెక్టు వ్యయం 10,151 కోట్లు అని తేల్చారు. దీనిలో 2 లక్షల 91వేల హెక్టార్లకు నీరందించుతామని ఆ ప్రకారం నిజ-వ్యయ ప్రయోజనంలో ప్రతి హెక్టారుకు 2 లక్షల 90 వేలు ఖర్చు అవుతుందని చెప్పారు. తర్వాత ప్రాజెక్టు వ్యయం 16,010 కోట్లు అనీ, అక్కడనుంచి 27వేల కోట్ల రూపాయలకు చేరింది. అది 2017 నాటికి 40,200 కోట్లకి చేరినట్లు పత్రికలు చెప్పాయి. ఇపుడు 58 వేలకోట్లు ఖర్చు అంచనాకి చేర్చారు. దీనిలో 33వేల కోట్ల రూపాయలు పునరావాసానికి అవుతుందని చెపుతున్నారు. ఇపుడు నిజవ్యయ ప్రయోజన లెక్కలను ఎక్కడా ఇవ్వడం లేదు. కాంట్రాక్టర్ల మార్పు, పనుల కేటాయింపు ఆ సంస్థల సాంకేతిక నిర్మాణశక్తిని బట్టికాక రాజకీయ నిర్ణయాలను బట్టి జరుగుతున్నాయి.

ఇంత ఖర్చుతో దేశంలోనే ఎన్నడూ జరగ నంతగా 2 లక్షలమంది పైచిలుకు ప్రజానీకాన్ని ఒకేసారి నిర్వాసితులను చేసే ప్రాజెక్టుగా పోలవరం ప్రాజెక్టు 'గణతికెక్కింది'.

**కమూనిస్టు విప్లవకారుల విధానం- ఏజన్సీ గిరిజనసంఘం, రైతుకూలీ సంఘాల కార్యాచరణ**

ఇక పోలవరం ప్రాజెక్టు పరిసరాల రాజకీయ, సాంఘిక నేపధ్యాలను ఇపుడు పరిశీలిద్దాం. ప్రాజెక్టు ప్రకటించే 2005 సం॥నాటికి ఎంతో ముందునుండే ఉభయగోదావరి ఏజెన్సీ ప్రాంతాల, పాత ఖమ్మం జిల్లాల ఆదివాసులు తమ జీవిత సమస్యలపై, భూమికోసం, భుక్తికోసం ఉద్యమాలలో నిలబడి వున్నారు. దేవీపట్నం, పోలవరం మండలాల్లో సుమారు 3వేల ఎకరాల భూమి గిరిజన-గిరిజనేతర వివాదంలో వుంది. అత్యధిక భూమి అప్పటికి 20 ఏళ్ళకి పైగా ఆదివాసుల సాగు, స్వాధీనం, అనుభవంలో వుంది. భూములు గిరిజనుల సాగులో వున్నాయి. భూములలోకి గిరిజనులు ప్రవేశించాకనే ప్రభుత్వం గిరిజనేతరులకు సెటిల్‌మెంట్ పట్టాలు మంజూరుచేసింది. అప్పటివరకూ అనధికారకంగా వున్న భూస్వాముల చేతుల్లోని భూములకు చట్టబద్ధత కల్పించింది. ఈ విధంగా భూములేమో గిరిజనుల చేతుల్లో వున్నాయి; భూములను, గ్రామాలను ఖాళీచేసి బయటకుపోయిన గిరిజనేతర భూస్వాముల చేతుల్లో పట్టాలు వున్నాయనీ వివాదానికి దిగారు. దీనికి రెవెన్యూశాఖ ఆమోదం తెలుపుతూవుంటే గిరిజన చట్టాలు, ఉద్యమ విధానాలు ఆమోదించటంలేదు. ఈ వాతావరణం 1980ల దశకంలోని సమసిపోయి, తిరిగి 2004 తర్వాత పునరావాసం-నష్టపరిహారాల విషయంలో తిరిగి భూస్వాములు వివాదం లేవనెత్తారు. దీనికి రెవెన్యూ, భూసేకరణ అధికారులు ద్వంద వైఖరి తీసుకొని వివాదాన్ని పెంచుతూ వచ్చారు. గిరిజన సంఘం, రైతుకూలీసంఘం తమ హక్కుల కోసం తమ వాదాలు కొనసాగిస్తున్నారు. అదీ భూమిలో సాగుచేస్తూ ఉత్పత్తులను సృష్టిస్తూ దృఢంగా నిలబడి వున్నారు.

**పోలవరంప్రాజెక్టు-బలాబలాల మార్పులు**

పోలవరం ప్రాజెక్టు ప్రకటనతో ఉభయ గోదారి, ఖమ్మం జిల్లాల గిరిజనేతర భూస్వామ్య వర్గాలు ఎక్కడెక్కడో వున్న వారంతా ప్రాజెక్టు వెనకకి చేరిపోయారు. వారు కాలంచెల్లిన సెటిల్‌మెంట్ పట్టాలు చూపించి తమ భూములు ప్రాజెక్టుకి ఇచ్చేస్తామని, తమకు నష్టపరిహారం ఇప్పించమని కోరసాగారు. తమ సాంఘిక బలాన్ని, ప్రజాఉద్యమంలోని వైరుధ్యాలను ఉపయోగించేందుకు పూనుకొన్నారు. పనిచేయించడానికి వచ్చిన కాంట్రాక్టర్లు మామూలు కాంట్రాక్టర్లుకారు. వారు పార్లమెంటు సభ్యులు, రాజకీయ నాయకులు. రాజ్యాంగ యంత్రంలోని అన్ని విభాగాలను కదిలించగలిగేవారు. దీనితో భూస్వాములు, కాంట్రాక్టర్లు, ప్రభుత్వ యంత్రాంగం లోని రెవెన్యూ, పోలీసు విభాగాలు అన్నీ ఒకవైపు నిలబడ్డాయి. గిరిజనేతర చిన్న రైతులను వీరు ఆకట్టుకోగలిగారు. వీరంతా ఒకవైపు, పోరాడుతున్న గిరిజనులు ఒకవైపుగా పరిస్థితి మారింది.

మరోవైపు ఆదివాసీ సమాజంలో ప్రారంభం నుండీ ఇంటిపేరిటగానీ, స్థానికులు, బయటివారు అనిగానీ వివిధ రూపాలలో ప్రతిచోట ప్రజలమధ్య చిన్న, చిన్న సాంఘిక వైరుధ్యాలు, అంతర్గత విభేదాలు వున్నాయి. కొండరెడ్డికి-కోయదొరలకు, కోయకమ్మర్లకు-గిరిజనేతర పేదలకి మధ్య తగదాలు పెట్టి మిత్ర వైరుధ్యాలను భూస్వామ్యవర్గాలు శత్రు పూరితం చేయ ప్రయత్నించారు. కానీ 1969లో కొండమొదలులో ఏజెన్సీ గిరిజనసంఘం కింద కమ్యూనిస్టు విప్లవకారులు పనిచేయడం ప్రారంభించాక ఈ వైరుధ్యాలన్నింటినీ అధిగ మించి ప్రజలను సాపేక్షంగా ఐక్యపరిచారు. సంఘర్షణల క్రమంలో ఐక్యపడిన ప్రజలు 1982లో కొండమొదలు పోలీసుకాల్పులను, 1997లో మనుగోపులలో భూస్వాముల కాల్పులను ఎదుర్కొన్నారు. కామ్రేడ్స్ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్య, కారం పార్వతిలు అమరులైనా పోరాటం కొనసాగించారు. భూములలో సమిష్టి పద్ధతులలో వ్యవసాయం సాగించారు. ప్రజలు తమ మధ్య సాంఘిక వైరుధ్యాలను కొన్నిచోట్ల పూర్తిగా తొలగించు కొన్నారు. కొన్నిచోట్ల తటస్థ పరచుకొన్నారు. పశ్చిమగోదావరిలో గిరిజన పెద్దలు అలా తటస్థంగా వుండి, వారు భూపోరాటాలలో పాల్గొనకపోయినా గిరిజనేతర భూస్వాముల తరఫున వెళ్ళకుండా నిలిచారు. గిరిజనేతర భూస్వాములు ఈ పెద్దలను సమీకరించగలిగేవారు కాదు. ఎపుడైతే కాంట్రాక్టర్లు,

అధికారులు ఒక్కటై నిలిచారో, భూపోరాటాలలో తటస్థంగా వున్న గిరిజన పెద్దలంతా వివిధ ప్రలోభాలకు లోనై ప్రాజెక్టు కాంట్రాక్టర్ల వైపు చేరిపోయారు. దీనితో అనేకచోట్ల తమ జీవించే హక్కుకోసం, భూమికోసం, అడవికోసం, అందరి కోసం పోరాడుతున్న ఆదివాసీ పురోగామిశక్తులు ఒంటరివారయ్యారు.

**నిర్వాసితుల పోరాటం**

మరోవైపు ప్రభుత్వం ప్రచారమాధ్యమాల ద్వారా "అభివృద్ధి"కి, ఆదివాసులకి మధ్య పోటీ పెట్టి, 'అభివృద్ధి' రధచక్రాల క్రింద అభాగ్యులు నలిగిపోవడం విధాయకమే అనే వాతావరణం తెచ్చింది. ఈ రకపు ముప్పేట దాడిలో ఏర్పడిన తాత్కాలిక నిరాశ, నిస్పృహ వాతావరణంలోనే సిపిఐ(ఎం-ఎల్) అగ్రనాయకులు ఈ ప్రాంతాలలో పర్యటించారు. ముందునుంచి పరిణామాలను గమనిస్తున్న సంఘ నాయకత్వం పరిస్థితికి తగిన విధానాలను అభివృద్ధిచేసుకొంది.

2005-2007 మొదటి దశలో పోలవరం ప్రాజెక్టు దానివెనక వున్న "విధ్వంసకర అభివృద్ధి" అనే వ్యూహాన్ని వివరిస్తూ అనేక రకాల దాడికి గురైన ప్రజలకి ఉపశమనంకోసం, ఊపిరితీసుకొనేందుకు తీవ్ర సంఘర్షణ జరిగింది. సంఘ నాయకత్వం విస్తృతమైన శక్తులతో ఐక్యకార్యాచరణలలోకి వెళ్ళింది. ప్రాజెక్టు విషయంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కర్ని కలిసి విశాల పోరాట అవసరాన్ని వారి ముందుంచింది. భద్రాచలంలో కె.సి.ఆర్.తో జరిగిన బహిరంగసభలో సంఘ నాయకులు కామ్రేడ్స్ కోటయ్య, యం.యస్.నాగరాజు పాల్గొన్నారు. యం.యస్.నాగరాజు బహిరంగసభలో ఉపన్య సించారు. మరోపక్క ఏకపక్షంగా పనులు చేపడుతూ, ఎవర్నీ లెక్కచేయని కాంట్రాక్టర్ల, అధికారుల దూకుడుకు వ్యతిరేకంగా సంఘం స్వతంత్రంగా ప్రజల్ని కదలించింది. గ్రామసభలు జరిపి పునరావాసం సంగతి తేలేంతవరకూ ప్రాజెక్టు పనులు చేపట్టరాదని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు, కాంట్రాక్టర్లు గిరిజన పెద్దలను కొనివేయాలని చూశారు. సంఘ నాయకులు పై ప్రలోభాలకి లొంగకుండా నిలవడంతో కామ్రేడ్ సున్నం రాజు తదితరులపై రాజద్రోహనేరం మోపి జైళ్ళల్లో నిర్బంధించారు. ఈలోగా ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన సుప్రీంకోర్టు సాధికార కమిటి వారిని కలిసి పునరావాసం ఒక షరతు అని, ముందు పునరావాసం-తర్వాతే నిర్మాణం అని స్పష్టం చేసింది. పనులు ఆపవలసిందిగా సాధికారకమిటీ చేసిన సూచనలను పెడచెవిన పెట్టి, కాంట్రాక్టరు పనులు సాగిస్తుంటే, వందలాది మంది జనం ప్రాజెక్టు పనులను అడ్డుకొని ఎర్రజెండాలను (2006 జూన్) పాతారు. నాటి నుంచి నేటివరకూ అనేక మలుపులు తిరుగుతూ ప్రజల ప్రయోజనాలకు అంటిపెట్టుకొని సంఘం తన ఉద్యమ కృషిని కొనసాగిస్తున్నది.

**ఒక ఐక్య, ఏకోన్ముఖ నిర్వాసిత ఉద్యమ నిర్మాణం ఎందుకు సాధ్యంకాలేదు?**

ప్రాజెక్టు నిర్మాణ ప్రారంభ దినాలలో మేధాపాట్కర్ నర్మదతరహా నిర్వాసిత ఉద్యమం నిర్మించాలని వచ్చారు. గిరిజన సంఘ నాయకులు, రైతుకూలీసంఘ నాయకులు యస్.ఝాన్సి, మేధాపాట్కర్, మానవహక్కుల సంఘ నాయకులు కలిసి సభలు జరిపారు. మేధాపాట్కర్‌తో నాటి భారీ నీటిపారుదల మంత్రి చర్చలు జరిపి, మేధాపాట్కర్ ప్రమేయం లేకుండానే ప్రభుత్వ పునరావాస విధానాలను ఆమె బలపర్చినట్లు మంత్రులు ప్రకటనలు ఇచ్చారు. దీని తర్వాత ఆమె కృషి ముందుకు పోలేదు.

నర్మద ప్రాంతంలో ప్రాజెక్టు వ్యతిరేక ఉద్యమానికి ఇక్కడకు కొన్ని తేడాలు వున్నాయి. నర్మద బచావ్ ఆందోళన వేళ్ళూనుకొనడానికి అక్కడ ఒక నాయకత్వ శూన్యత వుంది. ఇక్కడ అది లేదు. విభిన్న రాజకీయ పక్షాలు తమతమ ప్రాబల్యం పెంచుకొనేందుకు, కొత్తకొత్త ఎత్తుగడలు వేయ గలవు. నర్మద ప్రాంతం కంటే ఇక్కడ గిరిజన, గిరిజనేతర ప్రజలలో రకరకాల ప్రయోజనాలతో వ్యవహరించే సాంఘిక సమూహాలు వున్నాయి. భూస్వామ్య-కాంట్రాక్టర్-ప్రభుత్వ యంత్రాంగాలు కలిసి ప్రజలలో విభిన్న శక్తులను ప్రభావితం చేయగలిగాయి. విప్లవ సంస్థలు కూడా ఒక ఉమ్మడి వైఖరి తీసుకోలేకపోయాయి. కొందరు ప్రాజెక్టును పూర్తిగా బలపర్చారు. ప్రాజెక్టు పర్యావరణ ప్రజాభిప్రాయ సదస్సులో ప్రాజెక్టు అనుకూల తీర్మానాలు చేశారు. కొందరు పూర్తిగా వ్యతిరేకించారు. పూర్తిగా వ్యతిరేకించే విప్లవాత్మక నినాదాలు ప్రాజెక్టుకు దూరంగా ఉన్న వార్ని ఉత్తేజితుల్ని చేయడానికి ఉపయోగపడవచ్చు. కానీ ఈ వైఖరి ప్రాజెక్టు ప్రాంతంలోకాని, ముంపుకు గురికాబోతున్న వారి ముందుగానీ ఏ కార్యక్రమాన్నీ ఉంచలేకపోయింది.

ఆదివాసీ సలహామండలిలో ఒక పార్టీకి చెందిన ఇద్దరు సభ్యులలో ఒకరు అనుకూలంగా మరొకరు వ్యతిరేకంగా మాట్లాడారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ వంటివి ఎర్రజెండాను ఏజెన్సీ నుంచి తొలగించడం ముఖ్య విషయమని, ఎర్ర జెండాల వారితో నిర్వాసిత సమస్యపై కలవరాదని దాని నాయకత్వంలో బలమైన సెక్షన్ వాదించి అమలు చేసింది. స్వచ్ఛంద సంస్థలకి చెందిన కొందరు, మొదట ప్రాజెక్టును వ్యతిరేకించారు. కానీ వారే కాంట్రాక్టులు దక్కించుకొని కాలనీల నిర్మాణాల వెంట కొట్టుకొని పోయి అన్ని రకాల అవినీతిని మూటగట్టుకొన్నారు. పార్లమెంటరీ ఓటింగు లెక్కలలో వున్న రాజకీయ పక్షాలన్నీ అవి ఏ రంగువి అయినా తమ ఓటుబ్యాంకును కాపాడు కొనేందుకు తగిన నినాదాలు ఇచ్చే వైఖరి చేపట్టాయి. నిలకడైన నిర్వాసిత ఉద్యమం బలపడక పోవడానికి ఇన్ని రకాల భిన్న ప్రయోజనాలున్న శక్తులు, వారి ప్రాబల్యం ఒక కారణంగా వుంది.

ఏజెన్సీ గిరిజన సంఘం ఒక ఐక్యఉద్యమం కోసం పైన పేర్కొన్న ప్రతి ఒక్కరి దగ్గరకూ వెళ్ళింది. సంఘం అధ్యక్షులు కా॥ఇల్లా రామిరెడ్డి నేతృత్వంలో నిర్వాసిత సమస్యపై అంగీకార అంశాలు ఎన్ని వుంటే అన్నిటిపై కలిసి సాగుదాం అని కోరింది. కానీ పైన పేర్కొన్న కారణాలవల్ల అనుకూలమైన ఫలితం రాలేదు.

ఏజెన్సీ గిరిజన సంఘం పోలవరం ప్రాజెక్టు వెనక పాలకుల రాజకీయ ఉద్దేశాలను ఎండ గట్టింది. మరోపక్క సమగ్ర, శాస్త్రీయ, పునరావాసం ఒక షరతుగా ముందుంచింది. పాలకుల 'అభివృద్ధి' ముసుగులో ప్రజలపై దాడికి 'సమగ్ర పునరావాస

నినాదమే' సరైన సమాధానం. ప్రాజెక్టు దిగువన వున్న విశాల ప్రజల్ని పునరావాస సమస్యను చూపి వారి మద్దతు కూడగట్టగలగడమో కనీసం తటస్థం చేయడమో సాధ్యపడుతుంది. ఒక చిన్న ప్రాజెక్టుకి పునరా వాసమే కల్పించని ప్రభుత్వం, భారతదేశం లోనే ఎన్నడూలేని అతిపెద్ద నిర్వాసితుల్ని సృష్టిస్తున్న పోలవరం ప్రాజెక్టు పునరావాసం కల్పించడం సామాన్య విషయం కాదు. సమగ్ర శాస్త్రీయ పునరావాస నినాదంతో అందరూ కదలినట్లైతే అలాంటి ఐక్య ఉద్యమాన్ని చూసి ప్రభుత్వం తేల్చుకోవలసి వచ్చేది. శుద్ధ అతివాదవైఖరి, శుద్ధ విప్లవాత్మకంగా కనిపించాలనే వైఖరి మరోసారి ఇక్కడా నష్టంచేసింది. ప్రజా ఉద్యమాల కార్యాచరణలో వున్న మిత, అతివాద ధోరణులు వాటివాటి వ్యతిరేక పాత్ర నిర్వహించాయి.

ఫలితంగా గిరిజనసంఘం ఒంటరి పోరాటం చేయాల్సివచ్చింది. కేసులను ఎదుర్కొంటూ ప్రజల ముందు అవసరానికి తగ్గ కార్యక్రమం ఇస్తూ చెదరిపోయిన శక్తులను తిరిగి కూడగట్టే ప్రయత్నం చేసింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో వైరుధ్యాలలో మార్పులు వచ్చాయని, ప్రాజెక్టు వల్ల అందరూ నిర్వాసితులౌతారు కనుక నివాసేతర, సాగేతర భూస్వాములకు ఇక్కడే వుంటూ ముంపుకి గురికాబోతున్న గిరిజనేతర పేద రైతులపట్ల విచక్షణా వైఖరితో ప్రజలమధ్య ఐక్యతకు పూనుకొంది. చట్టపర, ఉద్యమపర అన్ని అవకాశాలను ఉపయోగిస్తూనే ప్రజలు ఇన్ని దశాబ్దాలు పోరాడి సాధించుకొన్న భూమి హక్కులను నిలబెట్టుకొనేందుకు పట్టువిడుపులతో కూడిన కృషి సాగిస్తున్నది.

రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యస్.ఝాన్సీ పోలవరం సమస్యపై వ్రాసిన వ్యాసం ముగింపులో పేర్కొన్నట్లు "పరిస్థితి సంక్లిష్టంగా వుంది. పరిస్థితి ఆశావహంగానూ వుంది".

ooooo